ఈనాడు
THE HEART AND SOUL OF ANDHRA PRADESH
Wednesday , June 13, 2007 19:23 hrs IST

# డల్లాస్‌లో మేడసాని అష్టావధానం



ఉత్తర టెక్సాస్ తెలుగు అసోసియేషన్ (టాంటెక్స్ ) ఆధ్వర్యంలో డా. మేడసాని మోహన్ అష్టావధాన ప్రక్రియను నిర్వహించారు. డల్లాస్‌లోని డీఎఫ్‌డబ్ల్యు హిందూ దేవాలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమానికి దాదాపు 300 మంది తెలుగు సాహిత్యాభిమానులు హాజరయ్యారు.తొలుత స్వాగతోపన్యాసం చేసిన తోటకూర ప్రసాద్ మాట్లాడుతూ తెలుగు భాషకే ప్రత్యేకమైన అష్టావధానం గురించి సభికులకు వివరించారు.

అంతకు ముందు బూర్ల రఘుపతి సారథ్యంలో మేడసానికి ఘనంగా స్వాగతం పలికారు. అమెరికాలో మొదటిసారిగా అష్టావధానాన్ని నిర్వహించిన ఆచార్య. పూదూర్ జగదీశ్వరన్‌ను ఆయన సభకు పరిచయం చేశారు. జగదీశ్వరన్ కార్యక్రమానికి సంధాతగా వ్యవహరించారు. మేడసానితో పాటు ఎనిమిదిమంది పృచ్ఛకులను ఆయన సభకు పరిచయం చేశారు. పృచ్ఛకుల ప్రశ్నలు, అవధాని సమయోచిత సమాధానాలు సభికులను విశేషంగా ఆకర్షించాయి.



డా. జంధ్యాల జయకృష్ణ బాపూజీ (నిషిద్ధాక్షరి), గుమ్మడి గోపాలకృష్ణ( పురాణ

పఠనం), తోటకూర ప్రసాద్ ( సమస్యా పూరణం) , బోయరెడ్డి సుబ్రమణ్యం (ఘంటా గణనం), మనోహర్ రెడ్డి ( అప్రస్తుత ప్రసంగం), డా. తారాకుమార్ రెడ్డి ( దత్తపది), డా. పులిగండ్ల విశ్వనాథం ( ఆశువు), బోగవల్లి గాయత్రి ( న్యస్త్యాక్షరి)క్రియలను నిర్వహించారు. చిత్రావూరి లక్ష్మి, కంచి జయలక్ష్మిలు వీరికి సహకరించారు.



రసరమ్యంగా జరిగిన ఈ అష్టావధానం తెలుగు మహోజ్వల సాహితీవైభవాన్ని ప్రేక్షకుల కళ్ల ముందు ఆవిష్కరించింది. అనంతరం అవధానికి కిరీటధారణ కార్యక్రమాన్ని ఎంవీఎల్ ప్రసాద్ నిర్వహించారు. దీనిలో భాగంగా అవధాని అశ్వాహరోణం చేశారు. అవధానికి అత్యున్నత స్థాయి గౌరవంగా దీన్ని పరిగణిస్తారు. జగదీశ్వరన్ మోహన్‌కు గండపెండేరం తొడిగారు. హిందూ దేవాలయం తరఫున పూర్ణ నెప్రహా, రాజ్యలక్ష్మీరావు, అన్నపూర్ణ చిలుకూరిలు అవధానిని సత్కరించారు. టాంటెక్స్ అధ్యక్షుడు రాజారెడ్డి అవధానిని భారీ పూలమాల, శాలువాలతో సన్మానించారు.